కంటోన్మెంట్‌లో సమస్యలు తీర్చండి

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే శ్రీ గణేశ్ విజ్ఞప్తి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీ ఆవరణలోని సీఎం కార్యాలయంలో ఆయనను కలసి వినతిపత్రం అందజేశారు. ఏడాదన్నర కాలంగా కంటోన్మెంట్ పరిధిలోని వివిధ సమస్యలపై తాను ఇచ్చిన వినతులకు స్పందించడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తాజా సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాళ్లకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదప్రజల సొంతింటి కలను సాకారం చేయాలని విజ్ఞప్తి చేశారు. మారేడ్‌పల్లిలోని న్యూ క్లబ్ స్థలం అద్దె ప్రాతిపదికన (లీజ్ హోల్డ్)లో ఉన్నందున దానిని ఫ్రీ హోల్డ్ చేయమని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానని చెప్పారు.

సన్మానం



పదవీవిరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఇందిర తదితరులు

గాంధీఆస్పత్రి: క్రమశిక్షణ, చిత్తశుద్ధితో అందించిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర అన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) జగదీశ్వర్, ఆఫీస్ సబార్డినేట్ రవి ప్రకాశ్ పదవీవిరమణ అభినందన సభ శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగదీశ్వర్, రవిప్రకాశ్ అందించిన సేవలు అభినందనీయమన్నారు. తెలంగాణ ఉద్యమంలో జగదీశ్వర్ క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. అనంతరం శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావు, అడ్మినిస్ట్రేషన్ అధికారులు సుబ్బారావు, విక్టర్ ప్రవీణ్, ఆఫీస్ సూపరింటెండెంట్లు సురేష్, శివ, వైద్య ఆరోగ్య గెజిటెడ్ ఆఫీసర్ల సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేణుగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షేక్ అఫ్రోజ్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ హిందీ విభాగం నుంచి షేక్ అఫ్రోజ్ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.షీలా మిశ్రా పర్యవేక్షణలో సమకాలీన హిందీ చలన చిత్రాల్లో వృద్ధుల ప్రతిబింబం అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ గ్రామానికి చెందిన షేక్ అఫ్రోజ్ అనేక ఇబ్బందులను ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ టీచర్ ఉద్యోగం సాధించినట్లు పేర్కొన్నారు. ఇటీవల ఓయూలో జరిగిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డా.నారాయణన్, వీసీ ప్రొ.కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ డిగ్రీ పట్టాను అందుకున్నట్లు చెప్పారు.

'ఎస్టీ కులాలపై కుట్రలు మానుకోండి'

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు, ఆదివాసీల నాయకులు ఎస్టీ కులాలపై కుట్రలు మానుకోవాలని ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రవీంద్రనాయక్ హెచ్చరించారు. తెలంగాణలో ఎస్టీ జాబితా నుంచి మూడు కులాలను తొలగించాలని సుప్రీమ్‌కోర్టులో పిటిషన్ వేదయం దారుణమన్నారు. ఎస్టీల ఐక్యతకు విఘాతం కల్గించే పిటిషన్ వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్టీ నడుమ చిచ్చుపెడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావులను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ కోరారు.

పేదల కోసం అన్నదానం



సీఎస్ఐ వెస్లీ చర్చిలో అన్నదానం చేస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతంలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో శనివారం అన్నదానం చేశారు. సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో గత ఏడాది నుంచి పేదల కోసం సుమారు 40 మార్లు అన్నదానం చేస్తునట్లు పాస్టరేట్ కార్యదర్శి జాన్, ప్రాపర్టీ కార్యదర్శి కుమార్ తెలిపారు. ప్రతీ శనివారం చర్చికి చెందిన సభ్యులు వారి కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం పేదల కోసం అన్నదానం చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ శనివారం సత్యమ్మ, మేరీ జ్ఞాపకార్థం చేసిన అన్నదానంలో సుమారు 500 మంది పేదలు పాల్గొన్నారు.

నేటి నుంచి నిమజ్జనోత్సవాలు

- జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు పూర్తి
- అప్రమత్తమైన పోలీసులు



చిలకలగూడ ప్రధాన రహదారిలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సికింద్రాబాద్: నియోజకవర్గంలో ఆదివారం నుంచి గణపతి నిమజ్జనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నియోజకవర్గంలో మొత్తంగా పోలీసు అనుమతి పొంది మండపాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలు వెయ్యి వరకు ఉన్నాయి. ఇందులో చిలకలగూడ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 755 విగ్రహాలు ఉండగా, మిగతావి ఓయూ, తుకారాంగేట్ పీఎస్‌ల పరిధిలో ఉన్నాయి. ఇందులో విగ్రహాల ఎత్తును బట్టి నిమజ్జనం తేదీలను ముందే నిర్ణయించిన పోలీసులు ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులకు సమాచారం అందించారు. చిన్నపాటి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు చిలకలగూడ మైదానంలో జీహెచ్‌ఎంసీ అధికారులు కృత్రిమ చెరువును ఏర్పాటు చేశారు. ఓ మోస్తరు నుంచి భారీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్, సఫిల్‌గూడకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. శాంతినగర్ నుంచి మారేడుపల్లి, లాలాపేట నుంచి తార్నాక, తార్నాక నుంచి చిలకలగూడ, జామైఉస్మానియా నుంచి సీతఫల్‌మండి మీదుగా హుస్సేన్‌సాగర్‌కు విగ్రహాలు ఊరేగింపుగా తరలివెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా ఆయా మార్గాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు అవసరమైన చర్యలు తీసుకున్నారు. రహదారులపై గుంతలు పూడ్చడం, మ్యాన్‌హోళ్ల మరమ్మతులు, రహదారులకు ఇరువైపులా చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాలు శనివారం సాయంత్రం వరకు పూర్తి చేశారు. కృష్ణాష్టమి ఊరేగింపు సందర్భంగా ఇటీవల ఉప్పల్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు కిందకు వేలాడుతున్న విద్యుత్‌తీగల బిగింపు వంటి చర్యలు పూర్తి చేశారు. విగ్రహాల ఊరేగింపు కోసం తరలివెళ్లే మార్గాల రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేసుకున్న పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఐదు పోలీస్‌స్టేషన్ల పరిధిలో అదనపు పోలీసు బలగాలు కలుపుకొని సుమారు 1500 మంది వరకు పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. నిమజ్జనం కార్యక్రమం కోసం ఇప్పటికే పలు భారీ వాహనాలు, ట్రాలీలు ఈ ప్రాంతానికి చేరుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించిన మీదట సికింద్రాబాద్ పురవీధుల గుండా నిమజ్జనోత్సవ ఊరేగింపులు ప్రారంభం కానున్నాయి. ఐదు డివిజన్లలో కలిపి మొదటి రోజు 300 విగ్రహాల వరకు నిమజ్జనోత్సవం కోసం తరలివెళ్లనున్నట్టు పోలీసులు అధికారులు తెలిపారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

- ఎమ్మెల్యే శ్రీగణేశ్



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

రాంగోపాల్‌పేట్: ఇష్టంతో కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నతంగా స్థిరపడొచ్చని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శనివారం రెజిమెంటల్ బజార్‌లోని నెంబర్ వన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రెజిమెంటల్‌బజార్‌లో పర్యటన సందర్భంగా స్కూలు విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. తాను కూడా ఎన్నో ఇబ్బందుల మధ్య చదువుకున్నానని ఫలితంగా ఈస్థాయికి ఎదిగానన్నారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరు చదువుకు దూరం కావద్దు అన్న ఉద్దేశ్యంతో శ్రీగణేశ్ ఫౌండేషన్ ద్వారా చేయూత అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాల అనగానే ఏదో మూలన చిన్నచూపు ఉంటుందని అది సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులందరూ ఉత్తమ శిక్షకులని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. విద్యార్థులను ఏ పాఠశాలలో చదివిస్తున్నామన్నది గొప్పకాదని, వారు ఎంత మంచిగా చదువుతున్నారన్న విషయంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌరీశంకర్, నందికంటి రవి, బద్రియాదవ్, సంతోషయాదవ్, బాబురావు, వరలక్ష్మి, నాగేష్‌యాదవ్, అరవింద్‌యాదవ్, వెంట్రాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం



తార్నాకలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నేతలు

లాలాపేట: ప్రధాని నరేంద్రమోదీ తల్లిని కాంగ్రెస్ నాయకులు అవమాన పరిచేలా మాట్లాడినందుకు రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని సికింద్రాబాద్ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తార్నాక చౌరస్తాలో సికింద్రాబాద్ బీజేపీ ఇన్‌చార్జి మేకల సారంగపాణి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మతో నిరసన ర్యాలీ చేసి దహనం చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తార్నాకలో ఆందోళన చేస్తున్న బీజేపీ నిరసన కారులను ఓయూ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ భారత్‌ను ప్రపంచంలో అగ్రభాగాన నిలబెట్టడానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రధాని మోదీ గొప్ప నాయకుడని పేర్కొన్నారు. విశ్వగురు లాంటి మహా వ్యక్తి మాతృమూర్తిని అవమాన పరిచేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో తిరుగుతూ తొలగించిన రోహింగ్యాల ఓట్ల కోసం ఉద్యమం పేరుతో ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనకట్ల హరి, వెంకటేషగౌడ్, కృష్ణమూర్తి, వీరన్న, ప్రకాష్‌గౌడ్, కన్నాభిరామ్, పోచయ్య యాదవ్, ప్రభు గుప్త, ఉపేందర్ తదితరులున్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు లయన్స్ క్లబ్ విరాళం



సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌కు 30 టేబుళ్లు, 30 కుర్చీల కొనుగోలు నిమిత్తం లయన్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320బీ, 320 సంస్థలు రూ.2,28,920లను విరాళం అందజేశాయి. కళాశాలలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ అన్నీ షెరాన్, లియో క్లబ్ కన్వీనర్ డాక్టర్ డి.సరితల సమక్షంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఆ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సైరాంరాజు, పీఎంసీసీ విద్యాసాగర్‌రెడ్డి, దుర్గావాణి సురభి, జీఎస్‌టీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, జీఈటీ కో–ఆర్డినేటర్ అరుణ్ గూడూరి చల్లా శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల, హర్భిందర్‌సింగ్ హాజరయ్యారు. విరాళం అందించేందుకు ముందుకొచ్చిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ప్రిన్సిపాల్ పద్మావతి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కంప్యూటర్ ల్యాబ్ ద్వారా డిగ్రీ, పీజీ కోర్సులు చదువుతున్న 4,500 మందికి పైగా విద్యార్థినులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

కౌకూర్‌లో ఆక్రమణల తొలగింపు

అక్రమంగా నిర్మించిన దుకాణాల కూల్చివేత

బొల్లారం: కంటోన్మెంట్ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కంటోన్మెంట్ బోర్డు చీఫ్ ఇంజనీర్ ఉమా శంకర్ హెచ్చరించారు. 8వ వార్డ్ కౌకూర్ ప్రాంతంలోని జీ.ఎల్.ఆర్ సర్వే నంబర్ 85, రెజిమెంటల్ బజార్ పరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా నిర్మించిన 10 దుకాణాలను శనివారం కంటోన్మెంట్ బోర్డు అధికారులు కూల్చివేశారు. క్లాస్–సీ ల్యాండ్‌లో ఎటువంటి నిర్మాణాలను అనుమతించబోమని ఇటీవల కొందరు వ్యాపారులు షాపులు నిర్మించి వ్యాపారం కొనసాగిస్తున్న నేపథ్యంలో స్థానికుల ఫిర్యాదుతో ఈ చర్యలు చేపట్టారు. సీఈఓ మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు బోర్డు ఇంజనీరింగ్ విభాగం అధికారులు, బొల్లారం పోలీసుల సహకారంతో పోలీస్ బందోబస్తు నడుమ జీసీబీ సాయంతో షాపులను నేలమట్టం చేశారు. ఈ కూల్చివేతల్లో ఇంజనీరింగ్ విభాగం అధికారులు రాజేశ్వర్‌రావు, తరుణ్, శివాజీ, జిష్ణు, శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమిత్ తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్‌లో కూడా ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.



అక్రమ నిర్మాణాలను తొలగింపును పరిశీలిస్తున్న అధికారులు



క్లాస్–సీ భూమిలో నిర్మించిన షాపులను కూల్చివేసిన అధికారులు

ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మృతి



రవీందర్

బన్సీలాల్‌పేట్: డివిజన్‌లోని బోలక్‌పూర్ ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.రవీందర్(53) శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న శనివారం కన్నుమూశారు. దీంతో ఆయన మరణవార్త తెలియగానే వివిధ పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. బీజేపీ నాయకులు మర్రి పురురవరెడ్డి, గుంటి సత్యనారాయణ, ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు రవీందర్‌కు నివాళులర్పించారు. అనంతరం రవీందర్ అంత్యక్రియలు బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికలో నిర్వహించారు.

ఓయూ స్పోకెన్ ఇంగ్లీష్‌లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ సెల్ట్‌లో స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. పది పాసైన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు, ఇతరులు సెల్ట్ శిక్షణలో ప్రవేశాలకు అర్హులని డైరెక్టర్ ప్రొ.నవీన్ శనివారం పేర్కొన్నారు. వచ్చే నెల 8 నుంచి ప్రారంభమగు శిక్షణ తరగతులకు 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7989903001 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడాలన్నారు.

బురదమయంగా రోడ్డు

అవస్థలు పడుతున్న ఇందిరానగర్ వాసులు



గుంతలు,బురదమయంగా ఇందిరానగర్ రోడ్డు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని లాలాపేట ఇందిరానగర్ వాసులు ఏటా వర్షకాలంలో బురదమయంగా మారుతున్న రోడ్డుతో నానా అవస్థలు పడుతున్నారు. దాదాపు 50 నుంచి 100 మీటర్ల దూరం సీసీ రోడ్డు నిర్మాణం కోసం 4 ఏళ్ల క్రితం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం తవ్వి వదిలేసిన రోడ్డు అధ్వానంగా తయారైంది. ఏళ్లు గడుస్తున్నా ఇందిరానగర్ రోడ్డు సమస్యలను పట్టించుకోవడం లేదు. వర్షకాలంలో బురదతో పాటు గుంతలు ఏర్పడటంతో ఈ మార్గం గుండా లాలాపేట, సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురి కాలనీవాసులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. స్థానికులు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ బి.యాదగిరి ఈ విషయమై పక్కా రోడ్డు వేయాలంటూ ప్రభుత్వ కార్యాలయాలు ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయారు.ప్రజల సమస్యను పట్టించుకునే నాధుడే లేడన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ రోడ్డును నిర్మించాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మినిస్టర్‌ను కలుస్తానని తెలిపారు.

ఘనంగా ఓయూలో గ్రాడ్యుయేషన్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. శనివారం కాలేజీ అసెంబ్లీ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ఓయూ వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు డిగ్రీ పట్టాలను, బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అతిథి గోపాల్ టీకే కృష్ణ, డీన్ ప్రొ.కృష్ణయ్య, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొ.విద్యాసాగర్, ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.మంగు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులకు బియ్యం

- రేపటి నుంచి సరఫరా
- రేషన్ దుకాణాలకు చేరిన సన్నబియ్యం



రేషన్ అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

సనత్‌నగర్: ఎప్పుడెప్పుడు రేషన్ తీసుకుంటామా? అని ఎదురుచూపులు చూస్తున్న కొత్త రేషన్‌కార్డుదారుల కల నేరవేరనుంది. రేషనింగ్ బేగంపేట సర్కిల్ పరిధిలోని రేషన్ దుకాణాలకు కొత్తవారితో కలుపుకొని సెప్టెంబర్ నెల కోటా కింద సన్న బియ్యం ఇప్పటికే చేరుకుంది. ఫస్ట్ తేదీ రావడమే ఆలస్యం రేషన్ తీసుకునేందుకు కొత్త రేషన్‌కార్డుదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించి మూడు నెలల రేషన్ సన్నబియ్యాన్ని జూన్ నెలలోనే పంపిణీ చేసిన విషయం విధితమే. రెండు నెలల విరామం తర్వాత రేషన్ దుకాణాలు సెప్టెంబర్ –1న తెరుచుకోనున్నాయి.

- బేగంపేట రేషనింగ్ సర్కిల్–8 పరిధిలో 67 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఈ సర్కిల్ మూడు నియోజకవర్గాల వ్యాప్తంగా విస్తరించి ఉంది.
- సనత్‌నగర్ నియోజకవర్గంలో రాంగోపాల్‌పేట, మోండా, బన్సీలాల్‌పేట, బేగంపేట డివిజన్ల వ్యాప్తంగా 22 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అలాగే కంటోన్మెంట్ నియోజకవర్గంలో 31 రేషన్ షాపులు ఉన్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలో రెండు డివిజన్లు కవాడిగూడ, బోలక్‌పూర్ డివిజన్లలో 12 షాపులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కిందికి బేగంపేట డివిజన్‌లోని రెండు షాపులు వస్తాయి.
- రేషనింగ్ సర్కిల్–8 పరిధిలోని 67రేషన్ దుకాణాల పరిధిలో మొత్తం 73,249 కార్డులు ఉండగా, అందులో ఆహార భద్రతాకార్డులు 69,350,అంత్యోదయ అన్నయోజన కార్డులు 8,974 కార్డులు ఉన్నాయి.
- అయితే కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టడంతో బేగంపేట రేషనింగ్ సర్కిల్–8 పరిధిలో ఇప్పటివరకు 12,989 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో సమగ్రంగా పరిశీలించిన అనంతరం 7,000 వరకు అప్రూవల్ చేశారు. నిరంతర ప్రక్రియగా స్వీకరిస్తున్న మిగతా దరఖాస్తులను పరిశీలిస్తూ అర్హులైన వారిని ఎంపిక చేసే పనిలో అధికారులు ఉన్నారు.
- అధికారులకు చేరిన దరఖాస్తుల క్రమసంఖ్య ఆధారంగా అప్రూవల్ చేసిన 3,341 కొత్త కార్డుదారులకు సెప్టెంబర్ నెల నుంచి రేషన్ కోటా పొందనున్నారు. అలాగే ఇటీవల అప్రూవల్ చేసిన దరఖాస్తుదారులకు అక్టోబర్ నుంచి రేషన్ అందజేయనున్నారు.
- ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున ప్రతినెలా 15,79,344 కిలోల బియ్యాన్ని సరఫరా చేయనున్నారు.
- అన్ని రేషన్ దుకాణాలకు పంపిణీ అవుతున్న సన్నబియ్యాన్ని ప్రతిరోజూ రేషనింగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేస్తున్నారు. బియ్యంలో నాణ్యత ఉందో లేదో పరిశీలిస్తున్నారు.

బేగంపేట రేషనింగ్ సర్కిల్–8 పరిధిలో రేషన్ వివరాలు ఇలా..

మొత్తం రేషన్ షాపులు	67
మొత్తం కార్డులు	73,249
అంత్యోదయ అన్నయోజన కార్డులు:	3,899
అంత్యోదయ కార్డు లబ్ధిదారులు:	8974
ఫుడ్ సెక్యూరిటీ కార్డులు:	69,350
ఫుడ్‌సెక్యూరిటీ కార్డుల ద్వారా లబ్ధిపొందుతున్న వారు:	2,54,250
మొత్తం లబ్ధిదారులు:	2,63,224

మహాగణపతిం మనసాస్మరామి

వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వాడవాడలా వీధివీధినా వెలసిన మంటపాల్లో కొలువుదీరిన పార్వతీసుతుడి సేవలో భక్తులు పునీతులవుతున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తిపారవశ్యంలో మునిగితేలుతున్నారు. ఆయా డివిజన్లలో గణేష్ ఉత్సవ సందడితో వీధులన్నీ శోభిల్లుతున్నాయి. పలుచోట్ల గణనాథుల మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సికింద్రాబాద్ / కంటోన్మెంట్ / సనత్‌నగర్ జోన్ బృందం



చిలకలగూడ : చిలకలగూడ మున్సిపల్ మైదానంలో నిమజ్జన సందడి



జెక్‌కాలనీ వాసవీ మిడోస్ అపార్ట్‌మెంట్ గణపతిని దర్శించుకున్న ఎస్సార్‌నగర్ ఏసీపీ



బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ కమ్యూనిటీ హాల్‌లో..



సనత్‌నగర్: మోడల్‌కాలనీలో కూచిపూడి నృత్య కళాకారులను అభినందించిన నిర్వాహకులు



సనత్‌నగర్: మోడల్‌కాలనీలో కుంకుమార్చన పాల్గొన్న మహిళలు



మధురానగర్‌లోని వినాయకుడి పూజలో మాజీ సైనికాధికారి బ్రహ్మారెడ్డి, జగదీశ్ నారాయణ



అడ్డగుట్ట: అన్నదానంలో కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



సనత్‌నగర్ లింగయ్యనగర్‌లో గణనాధుడి పూజలో బీజేపీ నాయకులు

అధ్వానంగా పారిశుద్ధ్యం

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి వదిలేసిన వ్యర్థాలు

అమీర్‌పేట: భారీ వర్షాలతో కాలనీ, బస్తీల్లో అపరిశుభ్రత నెలకొని ప్రజలు రోగాల పాలవుతున్నా పారిశుద్ధ్యంపై జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన మైత్రివనం, గంగుబాయి, గాయత్రీనగర్, ఎస్ఆర్‌నగర్‌లో నీటి ప్రవాహానికి బురదతో పాటు వ్యర్థాలు పెద్ద ఎత్తున కొట్టుకొని వచ్చాయి. వ్యర్థాలను తొలగించడంలో శ్రద్ధ చూపకపోవడంతో స్థానికంగా దోమల వ్యాప్తితో అంటువ్యాధులు ప్రభలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్లపై ఉన్న వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు ఊడ్చి కవర్లతో అక్కడే పెడుతున్నారు. వాటిని సకాలంలో అక్కడి నుంచి తరలించాల్సి ఉన్నప్పటికీ తీవ్ర జాప్యం వహిస్తున్నారు. సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే నివాసం ఎదురుగా, బల్కంపేట, ఆర్‌అండ్‌బీ కార్యాలయం వంటి ప్రాంతాల్లో వ్యర్థాలను రోడ్ల పక్కన పెట్టి నాలుగు రోజులు అవుతున్నా.. ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని, అధికారుల నిర్లక్ష్యంతో అంటు వ్యాధుల బారిన పడుతున్నారని ప్రజలు ఆదేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షాకాలంలోనైనా వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి, అనారోగ్య సమస్యల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.